క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: తిమ్మాపూర్, తిమ్మాపూర్ చౌరస్తా కాలనీ, కొత్తూరు పట్టణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిమ్మాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో లైన్‌షిఫ్టింగ్ పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఓటరు జాబితాలో తప్పులు సరి చేసుకోండి

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: ఓటర్ జాబితాలోని తప్పులను సరి చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు జాబితాకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పు, ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలోని అభ్యంతరాలపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటరు జాబితాలోని తప్పుల సవరణకు అభ్యంతరాలను అందజేసుందుకు నేటితో గడువు ముగుస్తుందని సూచించారు. అభ్యంతరాల దరఖాస్తులను స్వీకరించేందుకు అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులతో ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు విధిగా పాల్గొని ఓటరు జాబితాలోని తప్పులను సవరించుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాలను ప్రదర్శిస్తామన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

మొయినాబాద్: మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు, రాజకీయ వత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలేదని ఆరోపించారు. హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మొయినాబాద్ ప్రాంత పేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో చదువుకు దూరమవుతున్నారన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రేష్వంత్, కార్యదర్శి చరణ్‌గౌడ్, నాయకులు విష్ణువర్ధన్, సాయిరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కొందుర్గు: పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సుమధుర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు సూచించారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు వేడుకలను జిల్లేడ్ చౌదరి గూడ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. వందేమాతరం, సుమధుర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఓ విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు శంకర్, నరేందర్, పార్వతి, శిరీష, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ నివారణ టీకాలు

షాబాద్: పీపీఆర్ వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారం, వెంకమ్మగూడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాల్‌రాజ్, గోపి, కృష్ణమూర్తి, సుధాకర్, రైతులు తదితరులున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ మాలతీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రణీత, స్వప్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం

మాతృభాషను ప్రేమించాలి

కొత్తూరు: ప్రతి ఒక్కరు తమ మతృభాషను ప్రేమించాలని కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం భగవంతు అన్నారు. పాఠశాలలో శుక్రవారం తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, రాజు, నవనీత, లీలారాణి, పద్మ, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద బాలికల ఉన్నత పాఠశాలలో..

షాద్‌నగర్: పట్టణంలోని వివేకానంద బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్ హర్మాశ్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి

కొందుర్గు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ పద్యాలు, గేయాలు, ఉపన్యాసాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గోపీనాథ్ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాలలో..

శంకర్‌పల్లి: పట్టణంలోని లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సుజీత్ కుమార్ తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: జెడ్పీహెచ్ఎస్‌లో..


షాద్‌నగర్: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కొందుర్గు: జెడ్పీహెచ్ఎస్‌లో..


శంకర్‌పల్లి: తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల బృందం

నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: వినాయక నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. శుక్రవారం ఆమె పట్టణ శివారులోని బొబ్బిలి చెరువు, పెరుమాళ్ల చెరువుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో ఘనంగా పూజలు అందుకున్న గణనాథులను ఘనంగా గంగమ్మ ఒడికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చెరువుల వద్ద క్రేన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటుగా, దారి వెంట ఉన్న కంప చెట్లను తొలగిస్తున్నామన్నారు. నిమజ్జనానికి ఎటువంటి ఆటంకం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

చెరువులవద్ద లైటింగ్

షాద్‌నగర్‌రూరల్: గణనాథుల నిమజ్జనానికి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ చెరువును శుక్రవారం ఎంపీడీఓ బన్సీలాల్, పట్టణ సీఐ విజయ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులవద్ద భక్తులకోసం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని బొబ్బిలి చెరువు, మండల పరిధిలోని బుచ్చిగూడ, దూసకల్ చెరువులవద్ద నిమజ్జనం కోసం కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని వివరించారు. చెరువులవద్ద లైటింగ్, టెంట్, క్రేన్ వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో మండప నిర్వాహకులు, భక్తులు అధికారులకు పూర్తి సహాయసహకారాలను అందించాలని కోరారు. చెరువులను పరిశీలించిన వారిలో ఎస్ఐ సుశీల, ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆరాధన తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

యూరియాకు తప్పని తిప్పలు

ఆందోళనకు దిగిన రైతులు

షాబాద్: రైతులకు యూరియా కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట యూరియా కోసం ధర్నా చేపట్టారు. ఉదయం 8గంటలకు రైతులు సహకార కార్యాలయానికి చేరుకున్నారు. అందుబాటులో లేదని చెప్పడంతో ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు.

712 మంది రైతులకు సరఫరా

శంకర్‌పల్లి: యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో రైతులు ఉదయాన్నే సరఫరా కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఆగ్రో మార్ట్, డీలర్ల ద్వారా పంపిణీ చేశారు. మొత్తం 32 టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చింది. ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున 712 మంది రైతులకు యూరియాని అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి చైతన్య తెలిపారు.


శంకర్‌పల్లి సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

రైతులు సంఘటితం కావాలి


షాబాద్: సంకెపల్లిగూడలో భారతీయ కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి


కొందుర్గు: బలరాముడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి

షాబాద్: రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సంకెపల్లిగూడ, కేశవగూడ, పోలారం, కక్కులూర్ గ్రామాల్లో బలరామ జయంతి సందర్భంగా కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా బలరామ జయంతి

కొందుర్గు: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బలరామ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బలరాముడి చిత్రపటానికి పూలమాల వేసి రైతు బండమీది పెంటయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ మండలాధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి రామస్వామి, నాయకులు వెంకటయ్య, రాజు, శేఖర్, మల్లేశ్, మహేందర్ పాల్గొన్నారు.

కేజీరెడ్డి కళాశాలలో జాతీయ సదస్సు

మొయినాబాద్: బలమైన గ్రామీణ, నగర సమదాయాల కోసం స్థిరమైన నీటి, వ్యర్థాల పరిష్కారాలు అనే అంశంపై సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు నిర్వహించే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని సమన్వయ కర్త సౌమ్య సుచరిత సింఘ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానం, సాంకేతికతలు, ఉత్తమ పద్ధతులు పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే ఈ జాతీయ సదస్సులో విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, విధాన నిర్మాతలు, పరిశోధకులు, ప్రయోగాత్మక నిపుణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల అభివృద్ధితో గ్రామాల అనుసంధానం

పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్‌రూరల్: రోడ్ల అభివృద్ధితోనే గ్రామాల అనుసంధానం పెరుగుతుందని పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బొక్క వెంకట్‌రెడ్డి అన్నారు. ఇటీవల చేవెళ్ల పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు నక్కలపల్లి–తోల్‌కట్ట చౌరస్తా వరకు రోడ్డు అభివృద్ధి చేపట్టాలని ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రీబీటీ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను శుక్రవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, హనుమంతుయాదవ్, తోల్‌కట్ట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు.. తరగని గనులు

సైకాలజిస్ట్ రాధాకృష్ణరావు

కేశంపేట: విద్యార్థులు ఉన్నతాశయాలతో లక్ష్యాలను చేరుకోవాలని సైకాలజిస్ట్ మందుమల రాధాకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణరావు మాట్లాడుతూ.. తరగతి గదులు తరగని గనులన్నారు. విద్యార్థులు ఎంత చదువుకున్న ఇంకా నేర్చుకోవాల్సింది ఉంటుందన్నారు. పరీక్షలను పండుగ రోజులుగా మార్చుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది రాధాకృష్ణరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, కళాశాల లెక్చరర్లు నారాయణ, అశిపాద్దీన్, లక్ష్మీరాజ్, ధ్రువవకుమార్, మల్లేష్, శ్రీకాంత్, భారత్, నాగయ్య, రాణి, శిరీష, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాధాకృష్ణారావును సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశానికి ఒలింపిక్స్‌లో తొలి బంగారు పథకం తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ అపర్ణ, సీఐ కాంతారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం హైతాబాద్‌లో ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే హైదరాబాద్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ స్థాయి చెస్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ప్రతినిధి హర్ష, గ్రామాలభివృద్ధి కమిటీ, పంచాయతీ సెక్రటరీ మహేందర్, యునైటెడ్ వే వీల్‌చైర్ క్రికెట్ అసోసియేషన్ కోచ్ మధు, కెప్టెన్ అరుంజైలు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. జిల్లా, జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువతను సన్మానించారు. జూనియర్ స్థాయిలో కృష్ణ మౌర్య, క్రాంతి చరణ్, సాయి నితిన్, సీనియర్ స్థాయిలో అజిత్, మాధవి, రమేష్‌లకు తొలి మూడు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది సతీశ్, రమేష్, మధు తదితరులున్నారు.


షాబాద్: వీల్ చైర్ క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, సీఐ కాంతారెడ్డి తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సవిత, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం సాధించాలి

శంకర్‌పల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో నైపుణ్యం సాధించి, అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని శంకర్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


షాద్‌నగర్: మహబూబ్‌నగర్ రోడ్డులో స్వర్ణగిరి సెట్టింగ్


షాద్‌నగర్: గాంధీనగర్ కాలనీలో తబలా ఆకారంలో మండపం


చేవెళ్ల: రచ్చబండ వద్ద భగవద్గీతా పారాయణం

❖ వైభవంగా గణపతి పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో గణనాథుడి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గణనాథుడి ఏర్పాటుకు వేసిన సెట్టింగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మూడో రోజు నుంచి లడ్డూ వేలం వేసి గణపతిని నిమజ్జనానికి తరలించారు.

– చేవెళ్ల, షాద్‌నగర్ జోన్ బృందం


శంకర్‌పల్లి: మహాలింగాపురంలో..


చేవెళ్ల: రెడ్డి అసోసియేషన్ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న పోలీసులు


కొందుర్గు: నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


షాబాద్: పీఎస్‌లో లడ్డూ కైవసం చేసుకున్న సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ సతీష్‌కుమార్


షాబాద్: గోల్డ్‌ఫేస్ కాలనీలో గణనాథుడి పూజ


మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ హనుమాన్ ఆలయంలో..


మొయినాబాద్‌రూరల్: కనకమామిడిలో..


శంకర్‌పల్లి: గణేశ్ యూత్ వద్ద అన్నదానం కార్యక్రమం


చేవెళ్ల: మిత్రమేళా యూత్ గణనాథుడి పూజలో కేఎస్ రత్నం